www.PapaCambridge.com

Cambridge International A Level

**Cambridge International Examinations**
Cambridge International Advanced Level

**TELUGU** **9690/02**

Paper 2 Reading and Writing **October/November 2014**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

*6209955735*

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, glue or correction fluid.
DO **NOT** WRITE IN ANY BARCODES.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి**

మీకిచ్చిన సమాధాన పత్రపు ముఖపత్రం మీది సూచనలను పాటించండి.

నిర్దేశించిన స్థలాలలో మీ సమాధాన పత్రాలన్నిటి మీద మీ పేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.

ముదురు నీలం లేదా నలుపు రంగు సిరా కలాలనే వాడండి.

స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**బార్‌కోడ్‌ల మీద ఏమీ రాయవద్దు.**

అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అందించిన సమాధాన పత్రంలో మీ సమాధానాలు **తెలుగులో** రాయండి.

పదకోశాలకు అనుమతి లేదు.

ప్రశ్నలలో సూచించబడ్డ పదపరిమితిని పాటించండి.

పరీక్ష కాగానే సమాధాన పత్రాలను అన్నింటిని ఒకటిగా గుదికూర్చి కట్టండి.

ప్రతి ప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర [ ]కుండలీకరణం గుర్తుల్లో గుణాలు సూచించబడ్డాయి.

This document consists of **5** printed pages and **3** blank pages.


© UCLES 2014

CAMBRIDGE International Examinations

**[Turn over**

www.PapaCambridge.com



## విభాగం 1

ముందుగా ఈ మొదటి పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు

2012 డిసెంబరు 27, 28, 29 తేదీలలో తిరుపతిలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు చాలా ఘనంగా జరిగాయి. మహాసభలలో పాల్గొనటానికి నిర్వాహకులు దేశంలోనూ, విదేశాలలోనూ ఉన్న తెలుగు ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. వారిలో ఎంతోమంది కవులు, రచయితలు, కళాకారులు, చలనచిత్రరంగంవారు, సమాజ సేవకులు, అధ్యాపకులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ప్రాతికేయులు, రాజకీయ నాయకులు, మొదలైనవారు ఉన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులు, పేరెన్నిక గన్నవారు అసంఖ్యాకంగా వచ్చి పాల్గొనటం వల్ల సభలు అత్యంత ప్రజారంజకంగా వెలుగొందాయి. మహాసభలలో పాల్గొనటానికి విచ్చేసిన వారికి చక్కని వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమాలలో విజ్ఞానం, వినోదం వెల్లివిరిసి సందర్శకుల మనస్సులలో కలకాలం నిలిచి పోతాయి అని అందరూ భావించారు. ఈ కారణాల వల్ల సభల నిర్వాహకులను అందరూ ప్రశంసించారు.

సామాన్య జనరంజకమైన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆయా రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులకు సన్మానాలు, కవిసమ్మేళనాలు, అత్యంత ప్రసిద్ధులై ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంగీత, నృత్య కళాకారుల ప్రత్యేక కార్యక్రమాలు, ప్రధాన వేదిక మీద నిర్వహించ బడ్డాయి. ఆ కార్యక్రమాలలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి అద్భుత కర్ణాటక శాస్త్రీయ సంగీత కచ్చేరి, ఎల్లా వెంకటేశ్వరరావు గారి స్వరలయ మాధుర్యాలను వెలార్చే మృదంగ విన్యాసం అత్యంత జనరంజకంగా నిలిచాయి అని చెప్పవచ్చు. అట్లాగే, ప్రసిద్ధ రంగస్థల కళాకారుల చేత కురుక్షేత్రం నాటకం కూడా ప్రేక్షకుల మనస్సులను చూరగొని కలకాలం మనస్సులలో నిలిచిపోయే అనుభూతిని కలిగించింది. తిరుపతి వేంకట కవులు రచించిన కురుక్షేత్ర పద్య నాటకం యాభై సంవత్సరాల క్రితం తెలుగు నాట ఆబాల గోపాలాన్ని ఉర్రూత లూగించిన నాటకం. ఆ తరం వారిలో ఆ నాటకం లోని పద్యాలు కొన్ని అయినా నోటికి రానివారు లేరు. ఆ నాటకాన్ని ఈ మహాసభలలో ప్రదర్శింప జేసి నిర్వాహకులు తెలుగు సంస్కృతీ ప్రభలను మరొక సారి వెలిగింప జేశారు.

ఈ విధంగా ప్రధాన వేదిక మీద తెలుగు సంస్కృతికి శిఖరాల వంటి కార్యక్రమాలు నిర్వహించటంతో పాటుగా వివిధ ప్రత్యేక శాఖలకు చెందిన కార్యక్రమాలను మహాసభలు జరిగిన మూడు రోజుల పాటు నిర్వహించటానికి ఉపవేదికలు, చర్చా వేదికలు ఏర్పాటు చేయటం జరిగింది. తెలుగులో వెలువడిన ప్రసిద్ధ నాటికలను, నాటకాలను, జానపద కళారూపాలను ఉపవేదికల మీద ప్రదర్శించారు. వాటిలో కొన్ని: 'సత్య హరిశ్చంద్ర', 'మేఘనాథుడు', వంటి పద్య నాటకాలు, 'కన్యాశుల్కం', 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువులు' వంటి సామాజిక నాటకాలు, 'అమ్మ ఒడి', 'బలి' వంటి నాటికలు. ప్రదర్శన కళారంగానికి చెందిన ప్రముఖ కళాకారులకు సన్మానాలు కూడా ఉపవేదికల మీదనే జరిగాయి.

చర్చా వేదికల మీద తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సామాజికాంశాలు, జానపదం, మొదలైన విషయాల మీద సదస్సులు జరిగాయి. ఆయా రంగాలలో లోతైన పరిశోధనలు చేసిన నిష్ణాతులైన వారిచే పత్ర సమర్పణలు, ఆ పత్రాల మీద ప్రయోజనకరమైన చర్చలు జరిగాయి.

ఈ కార్యక్రమాలకు మీడియా విశేషమైన ప్రచారాన్ని ఇచ్చింది. అన్ని దూరదర్శని కేంద్రాలూ ముఖ్యమైన కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేశాయి. తిరుపతి నగర ప్రజలు ఈ మహాసభలకు తమ నగరం స్థానం అయినందుకు ఎంతో గర్వించారు. కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో హాజరై తెలుగు భాషా సంస్కృతుల పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

© UCLES 2014

www.PapaCambridge.com

1 దిగువ పేర్కొన్న అర్థ వివరణలకు బాగా సరిపోయే పదాలు/పదబంధాలు పై పాఠ్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి: మిక్కిలి
సమాధానం: అత్యంత

(అ) ప్రసిద్ధి పొందినవారు [1]
(ఆ) ఎప్పటికీ [1]
(ఇ) మెచ్చుకున్నారు [1]
(ఈ) ఉపయోగకరమైన [1]
(ఉ) నేరుగా చూపించాయి [1]

[మొత్తం గుణాలు 5]

2 కింద సూచించిన పదాలను/పదబంధాలను వాటి అర్థం వ్యక్తం అయ్యేలా మీ సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

మాదిరి: సౌకర్యాలు
సమాధానం: ఆడపెళ్ళివారు మగపెళ్ళివారికి అన్ని సౌకర్యాలు చేసి వారి మెప్పులు పొందారు.

(అ) చూరగొనటం [1]
(ఆ) ఉర్రూతలూగించటం [1]
(ఇ) ప్రచారం [1]

బ్రాకెట్లలో సూచించిన పదాలను/పదబంధాలను ఉపయోగించి వాక్యాలను తిరగరాయండి.

మాదిరి: ప్రముఖ కళాకారులకు సన్మానాలు జరిగాయి. [సన్మానించారు]
సమాధానం: ప్రముఖ కళాకారులను సన్మానించారు.

(ఈ) ఆ కార్యక్రమం ప్రేక్షకుల మనస్సులను చూరగొని కలకాలం నిలిచిపోయే అనుభూతిని కలిగించింది. [కలిగించిన] [1]
(ఉ) ఆ తరంవారిలో ఆ నాటకం లోని పద్యాలు నోటికి రానివారు లేరు. [వచ్చు] [1]

[మొత్తం గుణాలు 5]

3 పై పాఠ్యం లోని వాక్యాలనే మక్కికి మక్కి దించకుండా కింది ప్రశ్నలకు మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.
(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించబడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ఎప్పుడు జరిగాయి? వాటికి ఆహ్వానాలు ఎవరెవరికి పంపించారు? [2]
(ఆ) మహాసభల నిర్వాహకులను అందరూ ప్రశంసించటానికి మూడు కారణాలుతెలపండి. [3]
(ఇ) రెండవ పేరా ఆధారంగా మహాసభలను గురించి మూడు విశేషాలు తెలపండి. [3]
(ఈ) ఉపవేదికలను, ఎందుకు ఏర్పాటు చేశారు? అక్కడ ఏయే కార్యక్రమాలు జరిగాయి? [3]
(ఉ) చర్చా వేదికల మీద జరిగిన కార్యక్రమాల గురించి రెండు అంశాలు తెలపండి. [2]
(ఊ) మహాసభల పట్ల తిరుపతి నగర ప్రజల స్పందనను తెలపండి. [2]

[మొత్తం గుణాలు 20]

www.PapaCambridge.com



## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువ నున్న రెండో పాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి.

### కొత్త తరం పద్య నాటక కళాకారుడు ప్రభాకర్

తెలుగు నాట ప్రసిద్ధమైన ప్రదర్శన కళలలో కూచిపూడి, బుర్రకథ, ఒగ్గుకథ, హరికథ, నాటక రంగం ముఖ్యమైనవిగా చెప్పుకో వచ్చు. వీటి మీద ప్రభాకర్ పరిశోధన చేస్తున్నాడు. ప్రభాకర్ స్వతహాగా పద్య నాటక కళాకారుడు. అతను తిరుపతి వేంకట కవులు రచించిన కురుక్షేత్రం అనే పౌరాణిక పద్య నాటకంలో కృష్ణుని పాత్ర పోషించటంలో ఎంతో ప్రతిభ కలవాడు. షణ్ముఖి ఆంజనేయులు, రఘురామయ్య వంటి పాత తరం కళాకారుల స్థాయిలో కాకపోయినా, ఆధునిక కాలానికి తగినట్లుగా ప్రేక్షకులను అలరించే సామర్థ్యం అతని సొంతం అని పలువురు విమర్శకుల ప్రశంసలు పొందినవాడు. పాత తరం నటులు పద్యాన్ని రాగ యుక్తంగా పాడటానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి నటనను అంతగా పట్టించుకో లేదు. రాగాన్ని ఎక్కువగా సాగదీసి ఆలపించేవారు. ఆ కాలంలో ప్రజలు రాగాన్ని ఎంత సాగదీసి పాడితే అంత ఎక్కువగా మెచ్చుకొనేవారు. కథ తెలిసినదే కనుక వారు నటన కంటె సంగీతాన్నే ఎక్కువ ఆస్వాదించేవారు. కాని ఆధునిక కాలంలో అభిరుచులు మారాయి. రాగాన్ని అదేపనిగా సాగదీసి పాడటాన్ని నేటి ప్రేక్షకులు అంతగా ఆదరించటం లేదు; వారు నటనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పద్యాన్ని కేవలం రాగ యుక్తంగానే కాకుండా భావ యుక్తంగా ఆలపించటాన్ని ఎక్కువగా మెచ్చుకుంటున్నారు.

పౌరాణిక నాటకాలలో రాణించా లంటే మంచి కంఠ స్వరం ఉండాలి; సంగీత జ్ఞానం ఉండాలి. భాషా పాటవం ఉండాలి. మంచి ఉచ్చారణ ఉండాలి. మంచి నటనా సామర్థ్యం ఉండాలి. వీటికి తోడు, మంచి శరీర సౌష్ఠవం కూడా ఉంటే రాణింపు మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రభాకర్‌కు ఈ లక్షణాలు అన్నీ ఉన్నాయి.

కురుక్షేత్ర నాటకంలో సాధారణంగా అందరూ 'పడక సీను' అని పిలిచే ఒక దృశ్యం ఉంది. ఈ దృశ్యంలో కృష్ణుడు తన విశ్రాంతి మందిరంలో ఒక శయ్య మీద పడుకొని ఉంటాడు. ఆయనకు తనను చూడటానికి దుర్యోధనుడు, అర్జునుడు రాబోతున్నారు అని తెలుసు. ముందు దుర్యోధనుడు వస్తాడు. అర్జునుడు కూడా వచ్చే దాకా లేవ కూడదు అనుకొని నిద్ర నటిస్తూ ఉంటాడు కృష్ణుడు. ఆయన పడుకొని ఉన్న శయ్యకు తల వైపున ఒక ఆసనం ఉంటుంది; కాళ్ళ వైపున కూడా ఒక ఆసనం ఉంటుంది. ముందు వచ్చిన దుర్యోధనుడు నిద్రపోతూ ఉన్న కృష్ణుణ్ణి చూస్తాడు. అతను లోపలికి వచ్చిన ద్వారం కృష్ణుడి కాళ్ళ వైపుకు ఉంటుంది. కనుక దుర్యోధనుడు కృష్ణుడికి కాళ్ళ వైపున ఉన్న ఆసనం మీద కూర్చుంటాడు. కాని వెంటనే అతని అభిమానం దెబ్బతింటుంది. దర్పంగా లేచి వెళ్ళి కృష్ణుడి తల వైపున ఉన్న ఆసనం మీద ఆసీను డవుతాడు. తర్వాత కొద్ది సేపటికి అర్జునుడు వస్తాడు. అర్జునుడికి కృష్ణుడి మీద అమిత మైన భక్తి. రాగానే ఆయన పాదాలకు నమస్కరించి ఆయన కాళ్ళ వైపున ఉన్న ఆసనం మీద కూర్చుంటాడు. కొద్ది క్షణాలలో కృష్ణుడు తాను నటిస్తున్న నిద్ర చాలించి లేచి కూర్చుంటాడు. అప్పుడు ఆయనకు తన శయ్యకు కాళ్ళ వైపున ఉన్న అర్జునుడు కనిపిస్తాడు. అప్పుడు "ఎక్కడ నుండి రాక యిటకు?" అని ఒక చక్కని పద్యం ఉంది. పద్యం ముగుస్తూనే కృష్ణుడు చాలా సహజంగా, అప్పుడే గమనించినట్లుగా దుర్యోధనుణ్ణి చూసి అతని దగ్గరికి వెళ్ళి ఎంతో మర్యాద చేస్తున్నట్లుగా అతని బుజం మీద చెయ్యి వేస్తాడు. అప్పుడు "బావా! ఎప్పుడు వచ్చితీవు" అనే పద్యం ఉంది. ఆ పద్యాలను ప్రభాకర్ హావభావాలతో రాగ యుక్తంగా ఆలపించటం ప్రేక్షకులకు ఒక చక్కని అనుభూతి. ఈ దృశ్యంలో అతని నటన అతనికి మంచి గుర్తింపు తెచ్చింది. ఈ గుర్తింపు వల్లనే అతనికి ఎన్నో సభలలో గొప్ప సన్మానాలు జరిగాయి.

© UCLES 2014

www.PapaCambridge.com

**4** పై పాఠ్యం లోని వాక్యాలనే మక్కికి మక్కి దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగు**లో మీ సొంత వాక్యాలలో సమాధానాలు రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణాలు గుర్తించ బడ్డాయి. భాషా పాటవానికి అదనంగా 5 గుణాలు ఉన్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15 + 5 = 20 గుణాలు.)

(అ) ప్రభాకర్ గురించి పాఠ్యం మొదటి పేరా, చివరి పేరా ఆధారంగా మూడు అంశాలు తెలపండి. [3]

(ఆ) పాత తరం నటులు దేనికి ప్రాధాన్యం ఇచ్చి, దేన్ని పట్టించుకోలేదు? [1]

(ఇ) పద్య నాటకాల పట్ల పాత తరం ప్రేక్షకుల అభిరుచులను గురించి రెండు అంశాలు, కొత్త తరం ప్రేక్షకుల అభిరుచులను గురించి రెండు అంశాలు తెలపండి. [4]

(ఈ) పౌరాణిక నాటకాలలో రాణించాలంటే ఏ లక్షణాలు ఉండాలి? [2]

(ఉ) పడక దృశ్యంలో రంగస్థలం మీద కనిపించే అంశాలలో మూడింటిని తెలపండి. [3]

(ఊ) "బావా! ఎప్పుడు వచ్చితీవు?" అనే పద్యాన్ని ఎవరు ఎవరిని ఉద్దేశించి పాడుతారు? ఆ సందర్భాన్ని వివరించండి. [2]

[మొత్తం గుణాలు 20]

**5** ఈ కింది ప్రశ్నలకు మీ సమాధానం మొత్తం 140 పదాలకు మించకుండా **తెలుగు**లో రాయండి.

(అ) ఇప్పుడు మీరు చదివిన రెండు పాఠ్యాలలోని కురుక్షేత్ర పద్య నాటకం గురించిన అంశాలను క్రోడీకరించి రాయండి. [10]

(అ) ఈ రెండు పాఠ్యాల మీద మీ స్పందనను తెలపండి. [5]

[భాషా పాటవానికి 5]

[మొత్తం గుణాలు 20]

© UCLES 2014

BLANK PAGE

www.PapaCambridge.com

© UCLES 2014

BLANK PAGE

www.PapaCambridge.com

© UCLES 2014

**BLANK PAGE**

www.PapaCambridge.com

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.

© UCLES 2014